క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ఇందుకూరుపేట: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని గంగపట్నంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. పిల్లల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. తొలుత అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు నివాళులర్పించారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.

ఇదేం పని సారూ..



బూట్లు వేసుకుని నివాళులర్పిస్తున్న సీఐ

వెంకటాచలం: వెంకటాచలం సీఐ సుబ్బారావు తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇస్కపాళెం గ్రామంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన నివాళి కార్యక్రమానికి సీఐను స్థానికులు ఆహ్వానించారు. ఆయన బూట్లతోనే బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేశారు. దీంతో అంబేడ్కర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా సీతారాముల పార్వేట ఉత్సవం



పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో ఆదివారం రాత్రి వైభవంగా సీతారాముల పార్వేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రెడ్డిజన సేవా సంఘం ఆధ్వర్యంలో ముందుగా ఉట్టి మహోత్సవాన్ని రామాలయం వద్ద యువకులు ఏర్పాటు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కోదండరాముడికి ఏకాంతసేవ



ముత్తుకూరు: శ్రీరామనవమి సందర్భంగా కృష్ణపట్నంలోని కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 6వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. చివరిరోజున స్వామికి ఏకాంతసేవ ఏర్పాటు చేశారు.

640 బస్తాల బియ్యం స్వాధీనం

కోవూరు: లారీలో తరలిస్తున్న 640 బస్తాల బియ్యాన్ని సివిల్ సప్లయ్స్ డీటీ బాలకోటమ్మ స్థానిక జాతీయ రహదారిపై సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వాటిని కోవూరు పోలీసులకు అప్పగించారు. అవి రేషన్ బియ్యం అనే సందేహాలు ఉండడంతో పరీక్షల నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నేడు పార్వేట ఉత్సవం

పొదలకూరు: పట్టణంలోని శ్రీరామమందిరం వద్ద మంగళవారం సీతారాముల పార్వేట ఉత్సవాన్ని నిర్వహిస్తామని ఉభయకర్తలు తుమ్మల బ్రదర్స్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పూజా కార్యక్రమం, సాయంత్రం 4 గంటలకు ప్రసన్న సీతారామ ఈవెంట్స్ మైదుకూరు వారిచే బృందావనం ప్రోగ్రామ్, సీతారాములు, ఆంజనేయస్వామి, లక్ష్మణుడు, భరతుడు వేషధారణలతో ఉత్సవాన్ని జరుపుతామని తెలియజేశారు.

నేత్రపర్వంగా..

- సంగమేశ్వరుని కల్యాణోత్సవం
- వైభవంగా రథోత్సవం
- పోటెత్తిన భక్తులు



శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

మనుబోలు: సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కండలేరు ఒడ్డునున్న శ్రీదేవి, భూదేవి సమేత సంగమేశ్వరాలయంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సర్వేపల్లి ఫణీంద్రశర్మ, సాయిశర్మ శివపార్వతులకు అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు మండలం నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆనవాయితీగా కొన్ని జంటలు ఈ కల్యాణ గడియల్లో వివాహం చేసుకున్నాయి. మనుబోలు ఉత్సవ కమిటీ వారు అన్నదానం చేశారు. పలువురు దాతలు మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మనుబోలు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామ పెద్దలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రథోత్సవాన్ని ఆదివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. సుమారు 30 అడుగుల ఎత్తున్న రథాన్ని భక్తులు భుజాలపై మోస్తూ మనుబోలు శివాలయం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కండలేరు ఒడ్డునున్న సంగమేశ్వరాలయం వరకూ ఉత్సవం నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం సంగమేశ్వరాలయం వద్ద శివపార్వతులకు కల్యాణం నిర్వహించిన అనంతరం సాయంత్రం కండలేరు జలాలతో చక్రస్నానం నిర్వహించారు. రాత్రి స్వామి దంపతులను ఉంచిన రథాన్ని భక్తులు భుజాలపై మోసుకుంటూ తిరిగి మనుబోలు శివాలయానికి తీసుకొచ్చారు.

ప్రసన్నకు పలువురి అభినందన



ప్రసన్నకు అభినందనలు తెలుపుతున్న రంగారెడ్డి

కోవూరు: వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో పాటు పలువురు నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాస్, ఏసునాయుడు, నాగ శ్రీనివాసులురెడ్డి, షేక్.మొహిద్దీన్, బెల్లంకొండ వెంకయ్య, నగేష్, లాలం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివి

- ఫైర్ ఆఫీసర్ విజయవరకుమార్



అమరవీరులకు నివాళులర్పిస్తూ..

పొదలకూరు: విధి నిర్వహణలో అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివని పొదలకూరు ఫైర్ ఆఫీసర్ విజయవరకుమార్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలళులర్పించారు. వ్యాపారులు అగ్నిమాపక చట్టాలను తెలుసుకుని నిబంధనల ప్రకారం వ్యాపారాలు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మల రమణయ్య, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



కోవూరు: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన ప్రసన్నకుమార్‌రెడ్డి

మనుబోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మనుబోలు దళితవాడ వద్దనున్న బాబాసాహెబ్ విగ్రహానికి స్థానిక దళిత నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జై భారత్ నేషనల్ పార్టీ ఆధ్వర్యంలో మనుబోలులో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొండూరుసత్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జట్ల కొండూరు ఉపసర్పంచ్, ఆ పార్టీ నాయకుడు ఆవుల తులసీరాం మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు.

➡ **ముత్తుకూరు:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగానికి రూపకల్పన చేసి పేద వర్గాలకు ఆశాజ్యోతి అయ్యారని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ అన్నారు. ముత్తుకూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం బాబాసాహెబ్ జయంతిని నిర్వహించారు. వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

➡ **తోటపల్లిగూడూరు:** మండలంలోని కోవెరపాళెం గ్రామంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు మాట్లాడుతూ బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. ఇంకా మండలంలో వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలు జరిగాయి. స్థానికులు నక్కా మనోహర్, వినయ్, పవన్, తేజ, శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

➡ **వెంకటాచలం:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, విజయానంద్ కుమార్ బాబు, డాక్టర్ ఆర్.మధుమతి తదితరులు పాల్గొన్నారు.

➡ బీజేపీ ఆధ్వర్యంలో నిడిగుంటపాళెం, పుంజులూరుపాడు, గొలగమూడి, ఇస్కపాళెం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రసాద్‌నాయుడు, కుంచి శ్రీనివాసులు యాదవ్, హసనాపురం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

➡ **పొదలకూరు:** స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద సోమవారం కార్యక్రమాలు జరిగాయి. బాబాసాహెబ్ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల దళిత బహుజన సేవా సమితి కార్యదర్శి కొప్పోలు చలపతిరావు మాట్లాడారు. ఎంపీడీఓ నరసింహారావు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూకోటి లక్ష్మీనారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకుడు రాఘవేంద్ర, టీడీపీ నేత మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జిల్లా అధికార ప్రతినిధి ఆలుపూరు పాపయ్యమాదిగ, నాయకులు అంకేశ్వరరావు, బీజేపీ ఎస్సీ సెల్ నాయకుడు కామంచి వెంకయ్య, శ్రీనివాసులు, యోహోవా తదితరులు పాల్గొన్నారు.

➡ బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఎం.అయోధ్యరామయ్య గౌడ్ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. నాయకులు ఎం.రవీంద్రబాబు, పెంచలయ్య, శ్రీనివాసులు, రమణమ్మ, ఏడుకొండలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ **కొడవలూరు:** అంబేడ్కర్ ఆశయ సాధనకు ఐక్యంగా కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నార్తురాజుపాళెంలోని అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, ఎంపీటీసీ పి.అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమటా శేషగిరిరావు, నాయకులు ఎస్.మాణిక్యరావు, దేవనబోయిన శివకుమార్, జడ్డా సాయి, కె.శివారెడ్డి, సయ్యద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. డీటీ సారంగపాణి, ఆర్‌ఐ సునీల్‌రెడ్డి, వీఆర్వోలు ఏడుకొండలు, సురేష్, దాసు పాల్గొన్నారు.

➡ కొడవలూరు దళితవాడలోని అంబేడ్కర్ విగ్రహానికి నేతాజీ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. సమితి సభ్యులు కాకాణి మురళి, నక్కా ప్రణయ్, ఎ.సుధీర్, సుబ్రహ్మణ్యం, పవన్, సుజీ, సన్నీ, రాధాకృష్ణ, జీవన్ పాల్గొన్నారు.

➡ గౌతమ్ నగర్‌లో సర్పంచ్ నాగిరెడ్డి సునిల్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఎంబీబీఎస్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు, నలుగురు రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. దళిత నాయకులు ఎల్లు జనార్దన్, కరేటి వేణు, నాగిరెడ్డి రమేష్, కె.వీరరాఘవులు, భాస్కర్, నవీన్ పాల్గొన్నారు.

➡ నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల్లో అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పది కిలోల కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు, ఎస్ఎస్ఎస్ పీఓ పి.రవికుమార్, ఏపీఓ ఫణికుమార్, ఏఓ కె.గిరీష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

➡ **ఇందుకూరుపేట :** మండలంలోని ఇందుకూరుపేట, కొత్తూరు, పల్లిపాడు, నిడిముసలి, ముదివర్తిపాళెం, కుడితిపాళెం, రాముడుపాళెం, గంగపట్నం, మైపాడు, కొరుటూరు, సోమరాజుపల్లి, జంగంవానిదొరువు, కొమరిక, రావూరు తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

➡ **కోవూరు:** అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పొలిటికల్ సలహా కమిటీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అలాగే కోవూరు ప్రధాన రహదారి దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి పలు సంఘాల నాయకులు నివాళులర్పించారు.

➡ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** అంబేడ్కర్ కలలను సాకారం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉద్యోగ సంఘాల నాయకుడు భీమతాటి వెంకటరమణయ్య అన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.

పెనుబల్లిలో..

పెనుబల్లి గ్రామ సచివాలయంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు.



వెంకటాచలం: వీఎస్‌యూలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలో ర్యాలీ



మనుబోలు: నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొడవలూరు : నార్తురాజుపాళెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన చలపతిరావు



ముత్తుకూరులో..



ఇందుకూరుపేట : కుడితిపాళెంలో..



టీపీగూడూరు: కోవెరపాళెం గ్రామంలో..



పొదలకూరులో..



మనుబోలు: మజ్జిగ చలివేంద్రం నిర్వహణ



కొడవలూరు : వెంకటేశ్వర విద్యాసంస్థల్లో..

ఊరెళ్తున్నారా.. సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి

కోవూరు: మండల పరిధిలో చోరీలు అధికంగా జరుగుతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. కోవూరు సీఐ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వేసవి నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారని, అలా వెళ్లే వారు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ట్రెయినీ డీఎస్పీ శివప్రియ, హెడ్ కానిస్టేబుల్ రషీద్ పాల్గొన్నారు.

చద్ది సమర్పణ నేడు

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో మొలక పోలేరమ్మకు మంగళవారం చద్ది సమర్పణ జరుగుతుందని కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. భక్తులు జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థికి సన్మానం

పొదలకూరు: పట్టణంలోని ఎస్‌పీబీవీడీ (సాయి విద్యానికేతన్) జూనియర్ కాలేజీలో పొదలకూరుకు చెందిన ప్రహ్లాద్ చదివాడు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 988 మార్కులు సాధించాడు. దీంతో యాజమాన్యం సోమవారం అతడిని సన్మానించింది. పాఠ్యాంశాలు బోధించిన అధ్యాపకులను కూడా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, ఎండీ తూపిలి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కొండాపురం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

పొదలకూరు: మండలంలోని డేగపూడి ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా పొదలకూరు ఏఈ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



ముత్తుకూరు: నివాళులర్పిస్తున్న సీఈఓ జగదీష్ పటేల్



టీపీగూడూరు: నివాళులర్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ముత్తుకూరు: ప్రాజెక్ట్‌లో పనిచేసే ప్రతి కార్మికుడు, ఉద్యోగి భద్రతా ప్రమాణాలు పాటించాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ అన్నారు. పోర్టులో సోమవారం 80వ జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అగ్ని ప్రమాద అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదాలను సాధ్యమైనంత తగ్గించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్మికులకు సురక్షితమైన వాతావరణం కల్పించడమే తమ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

➡ **తోటపల్లిగూడూరు:** అనంతపురంలోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సీల్) ప్రాంగణంలో సోమవారం జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ సీఈఓ రాఘవ్ త్రివేది మాట్లాడుతూ కార్మికుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కంపెనీ ఓఅండ్ఎం సునీల్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.